శ్రీనివాస కళ్యాణం

"కళ్యాణి! అక్షరాలా మీ కూతురు! మరొకళ్ళూ మరో కళ్ళూ కాదు, నేను నచ్చజెప్పటానికి." ఖంగుమంటున్న తల్లి గొంతు విని, అప్పుడే సినిమానుంచి వచ్చి మేడమీదికి పోబోతున్న కళ్యాణి మెట్లమీదే నిలబడిపోయింది.

"అయితే కళ్యాణి పెంకితనం చేస్తుందంటావా?" సాలోచనగా అన్నట్లుంది పద్మనాభయ్య గొంతు.

ఏమిటో, తల్లీ తండ్రీ తననుగురించే మంతనాలు! అలాగే నిల్చుని వినసాగింది కళ్యాణి.

"అతడు ఐ. ఏ. యస్. అట. ఢిల్లీలో ఉద్యోగం. ఇప్పుడు చూడకపోయినా వెనక ఏడెనిమిదేళ్ళ క్రితం చూచాను. చాలా అందంగా వుంటాడు. బుద్ధిమంతుడు. అటువంటి సంబంధం పోగొట్టుకుంటే మళ్ళీ తేలేం."

"మహాప్రభో, అవన్నీ సరే, నా కెందుకు? ముందు కూతురికి నచ్చచెప్పుకోండి."

"నువ్వు మెల్లగా చెప్పు. ఒప్పుకోకపోతే నేను తర్వాత చెప్తాను."

"ఏమోమరి! ఆవిడ ఖచ్చితంగా చెప్పేసింది, పెళ్ళి కొడుకును అది స్వయంగా చూచుకోవాలని. నావల్ల కాదు యిక ఒప్పించటం. అయినా కూతురికి పెంకెతనాలు నేర్పటం మీా వంతూను, దాన్ని దారికి తేవటం నావంతూనా?" అంటూనే వెళ్ళిపోయింది కమల.

విషయం అర్థమయింది కళ్యాణికి. నవ్వుకొంటూ వెళ్ళిపోయింది తనగదిలోకి. ఎందుకో ఈ తలిదండ్రుల కింత తొందర. పెళ్ళి జేసి తరిమెయ్యాలని! అప్రయత్నంగా పెదవులపై చిరునవ్వు నిలచింది! తన పెళ్ళి చెయ్యటానికి తండ్రి చేసే ప్రియత్నా లిన్నీ అన్నీ అని చెప్పనలవికాదు. కొన్ని తండ్రి కయిష్టమైతే కొన్ని తల్లికి నచ్చవు. ఆ యిద్ద రికీ నచ్చినవాటిని అన్నయ్య లిద్దరూ 'సెన్సారు' చెయ్యాలి. ఆ తర్వాత దాని భోగట్టా తనవరకూ వస్తుంది. ఇక వాళ్ళలో ముఖ్యంగా తనకు కొట్టొచ్చినట్టు లోపాలేకాని సుగుణాలు కానరావు. నిర్మొహమాటంగా వద్దని తెగేసి చెప్తుంది; అదే తల్లికి కోపకారణం. ఆమె కిష్టమయిన వాటికి యిక కూతురు అడ్డు చెప్పడం ఆవిడ దృష్టిలో అలవి కానంత మహాపరాధం! సిగ్గులేని పని. ఇప్పుడు సిగ్గుపడి,

తర్వాత నేనేడ్చి మిమ్మల్నేడిపించేకంటె ఇప్పుడే సిగ్గును త్రోసిపారేసి జీవితమంతా సుఖపడటం తెలివైనపని.” అంటుంది కళ్యాణి. ఆ వాదోపవాదాల వేడిలో ఒక్కో-రోజు అసలు తల్లీ కూతుళ్ళు మాట్లాడుకోరుకూడ. ‘ఏమయినా నాన్నగారు నాపక్షం; నాకేం భయం?’ అనుకొంటూంటే లోగడ జరిగిన పెళ్ళి చూపుల తతంగాలు గుర్తుకొచ్చాయి.

ఒకసారి ఒక పెళ్ళి సంబంధం వచ్చింది, ఆట్టే పెద్ద ప్రయత్నాలు చేయకుండానే. పద్మనాభమూ, కొడుకులిద్దరూ వెళ్ళి చూచి వచ్చారు. “చాలా బాగున్నాడు. ఆస్తిపరులు. ఇద్దరే కొడుకులు. ఇతడే పెద్దవాడు. బి. కాం. పాసై మద్రాసులో ఆడిటర్ కోర్సు చదువుతున్నాడు. తప్పక పాసౌతాడు. అందరూ అరవై వేలూ, యాభై వేలూ యిస్తామంటున్నారు కాని చదువుకున్న పిల్ల కావాలని కొడుకు ముచ్చట పడ్తున్నాడు. గనుక కొంచెం తక్కువ కట్నమయినా మన అమ్మాయిని చేసుకుంటారట. ముప్పైవేలకు మాత్రం తక్కువ తీసుకోరట.” అని చెప్పారు, ఇంటికొచ్చి. ఆ మాటలు కళ్యాణి వింది. విన్నట్టే మరిచిపోయింది. ఆమె దృష్టి ఎంతసేపూ చదువూ, పుస్తకాలూ, స్నేహితులూ మీదనే వుంటుంది కాని యింకో గొడవ పట్టదామెకు.

వారం రోజులు పోయాక పెద్దన్నయ్య శ్రీహరి భోజనం చేస్తూ చెప్పాడు; అందరూ అక్కడే వున్నారు. "మనం ఆ సంబంధం వదలుకోవటం మంచిది నాన్నా! ఇవ్వాళ వాళ్ళ దగ్గర్నుంచి వుత్తరం వచ్చింది. పెళ్ళికొడుకు తల్లీ తండ్రీ మేనమామా వస్తారట. కాని అతడు రావటం లేదట. అంటే అందులో కుంభకోణ మేమిటో ఆలోచించావా? ఈ రోజుల్లో స్వయంగా చూచుకోకుండా పెళ్ళి చేసుకొనే వాళ్ళెక్కడైనా వున్నా రంటావా?"

"పోనీ, రాకపోతేనేం? మనం చూచాముగా, బాగానే వున్నాడు?" అన్నాడు పద్మనాభం.

తల్లిముఖం సంతోషంతో ఎంత ప్రకాశవంతమైందో చెప్పటం కష్టం. "పిల్లవాడు అంత బుద్ధిమంతు డన్నమాట! తప్పకుండా చేసెయ్యాల్సిందే."

"ఊఁ చాల్లే, బుద్ధిమంతుడట, బుద్ధిమంతుడు!" విసుక్కున్నాడు శ్రీహరి. "అసలు రహస్యం ఏమంటే కుడి కాలు కొంచెం కుంటిఅట. ఆ రోజు మాముందు ఒక్క పది నిమిషాలు మాత్రం కన్పించాడు. ఆ కుంటి కన్పించకుండా ఎలాగో జాగ్రత్తగా నడిచాడు కాబోలు. ఇక్కడికొస్తే రహస్యం బయటపడి పోతుందని రావటం లేదు."

"అలాగా?" నిర్ఘాంతపోయారు పద్మనాభమూ, చిన్న కొడుకు మురళీని.

"పోనీ అదొక పెద్దలోపమా - అన్ని విషయాలూ నచ్చినప్పుడు?" అంది కమల.

"చాల్లే వూరుకో! ఏమంత ఖర్మ వచ్చిపడిందని కుంటివాడికీ, గుడ్డివాడికీ కట్టబెట్టడం? వద్దని వ్రాసేస్తాను." అంటూ లేచి వెళ్ళిపోయాడు తండ్రి, వింటూన్న కళ్యాణికి కోపం రాలేదు. 'పాపం అందంగా వున్నా, కుంటివాడనే బాధ. పోనీ గుణం మంచిదైతే రూపానికేమొచ్చె?' అను కొని లోలోన జాలిపడింది. కాని ఆ భావాలను పైకి వెల్ల డించే ధైర్యమూ లేదు. అలవాటూ లేదు.

"పోనీ వచ్చి వెళ్తారు. మనకేం నష్టం? ఇప్పుడు చెయ్యం అని చెప్దాం. బొత్తిగా రావద్దని నిష్కర్షగా చెప్పెయ్యడ మేంమర్యాద?" అన్నాడు మురళి.

"వచ్చి వెళ్ళారు; పిల్ల నచ్చలేదనే మాట వుండిపోవ టానికా? వాళ్ళ లోపం చెప్పుకోరు. మనమీద ఏదో వాదును వేస్తారు. అస లనవసరం. అత డిక్కడికి రావటం లేదన్నవాడు ఆ మాటమీదే నిలబడితే సంతోషించే వాడిని. తనలో లోపం వు-డీ, పిల్ల మాత్రం గొప్పగా వుండాలని ఆశ. ఈవూ రొచ్చి వాళ్ళనీ వీళ్ళనీ అడిగి ఎట్టు

వంటివాళ్ళో ఆరాతీశాడట. ఇంటి చుట్టూ, కాలేజి చుట్టూ ప్రదక్షిణ చేసి వెళ్ళాడట, అమ్మాయిని చూడటానికి. కన్పించిందట, నచ్చిందట. అందుకే ఈ ఉత్తరం వచ్చింది. పిల్లను చూడాలని తన కున్నంత పట్టింపూ, దానికూడా తన విషయంలో వుంటుందని ఎందు కనుకోడు? మిగతా విషయాలన్నీ ఎలా వున్నా, సూటిమార్గాలు వదిలేసి అడ్డు త్రోవలు తొక్కేవాళ్ళంటే నా కసహ్యం. అటువంటి ప్రవర్తనలలోనే మనుష్యుల స్వభావాలు బయట పడేది." అన్నాడు చీదరించుకుంటూ శ్రీహరి.

"ఇదంతా విన్నాక నాకూ బాగుండలేదు. ఏమైనా అల్లరిరకమేమో అని పిస్తోంది; వద్దులే." అంది కమల.

అంతా విన్న కళ్యాణి ఆశ్చర్యపోయింది. అంతవరకు అటువంటి ఆలోచనలే చెయ్యని ఆమె మొదటిసారిగా 'వివాహమంటే ఏమిటి?' అని ఆలోచించసాగింది.

పైకి అన్నదేకాని కమల ఆ సంబంధాన్ని చూస్తూ చూస్తూ వదలలేక భర్తకూ, కొడుకులకూ తెలియకుండా చాటుగా ఆరా తీయించింది. చాటుగా జరిగిన దర్యాప్తులో తేలిన విషయాలనుకూడా చాటుగానే వుంచి, కిమ్మనకుండా వూరుకోవలసి వచ్చింది. వారు చెప్పుకున్నంత ఆస్తిపరులు కాదు. కొడుకులు ఇద్దరేకాదు. ఇంకా పిల్లలున్నారు. పెండ్లి

కుమారుడు చదువుతున్న సి. ఎ. కోర్సు ఈ జన్మలో పాసవ గల ఆశలేదు. కట్నం ఎక్కువ రాబట్టటానికి పెండ్లి అయ్యే వరకూ అదొకనాటకం. వివాహం అయ్యాక ఆ వున్న బి. కాం. డిగ్రీతోనే ఏదో చిన్న ఉద్యోగం చేస్తాడు; లేదా అరక చేతబడ్తాడు.

నవ్వుకుంది కళ్యాణి. 'ఇన్ని మాసాలతో ఎందుకో ఆ పెళ్ళిళ్లు!' అంతే. రెండురోజుల్లో అంతా మర్చిపోయి చదువు, స్నేహితులలో పడిపోయింది. తర్వాత యేవో రెండు మూడు సంబంధా లొచ్చినా, అంత చెప్పుకోదగినవీ, గుర్తుంచుకోదగినవీ కాదు. ఈలోగా బి. ఎస్సీ. పూర్తై చదువు మానేసింది కళ్యాణి. కొంత వయస్సూ, చదువూ రావటం వల్లా, చదువూ వ్యాపకం లేక తీరికగా వుండటం వల్లా ప్రతివిషయాన్నీ పరిశీలనగా చూడడం, తెలివిగా తర్కించుకుని ఒక నిర్ణయానికి రావడం అలవాటయ్యాయి కళ్యాణికి. ఆ సమయంలోనే ఒక పెళ్ళిసంబంధం వచ్చింది. ఈసారి ఇదివఱకులాగా తన కేమీ పట్టనట్లు ప్రవర్తించి, తల్లిదండ్రుల నిర్ణయానికి వదిలెయ్య లేకపోయింది కళ్యాణి. తనకు తెలియకుండానే తనలో భవిష్యత్ జీవితంపై కొన్ని కొన్ని అభిప్రాయాలూ నిర్ణయాలూ ఏర్పడటం తెల్సుకొని తనే ఆశ్చర్యపోయింది. గతంలో జరిగిన

పెళ్ళిచూపు లవీ గుర్తుకువచ్చి కొంచం తనలో తనే చీకాకు పడింది.

ఒకనాడు తండ్రి పద్మనాభయ్యగారు పెండ్లికుమారుడి ఫోటో యిచ్చాడు కళ్యాణికి. మౌనంగా అందుకుని తండ్రి వెళ్ళిపోయాక తీసి చూసింది.

'గొప్ప అందగాడు!' అన్న తండ్రి మాటలు అబద్ధం కాదు. "ఎక్కడో ఏదో ఉద్యోగమట; బుద్ధిమంతుడట. మంచిదే. అయినా అసలు విషయం తెలిసేవఱకూ వాళ్ళు చెప్పినదే నిజమని నమ్మాలిగా?" అంది కళ్యాణి తల్లితో.

"చాల్లే. అందరూ ఒక్కలాగే వుంటారా? ఆ ముఖం లోనే వుంది అతడి మంచితనమంతా!" అంది కమల మందలింపుగా.

"ఓహో. ఫోటోలో మనిషి రూపంతోబాటు స్వభావం కూడ ముద్రపడి పోతుందని యివ్వాళ క్రొత్తగా వింటున్నాను" అంది హేళనగా.

"ఫోటోలో మనుషుల గుణాలూ, రాసుకున్న సెంట్లూ అత్తర్లూ పడవ్ అత్తయ్యా,"-అంది నవ్వుతూ మురళి భార్య ఇందిర, కళ్యాణికి సపోర్టుగా.

"నోరుమూసుకుని అవతలికి పొండి. పెంకెగుణాలూ, పెంకెమాటలూను" అని కమల కసురుకోవడంతో వదినా

మఱది ళ్ళిద్దరూ గప్ చిప్ గా బయటకు జారు కున్నారు.

"అంత అందగాడూ విద్యావంతుడూ ఉద్యోగస్థుడూ యింతకాలం వూరికే వుండిపోయా డంటావా వదినా? వయస్సుకూడా తక్కువేమీ కాదు. ఎక్కడో చిత్తూరు జిల్లా వాడు. ఏలోపమూ లేనిదే యింతవరకు రావడం అనుమానా స్పదమే" అంది తర్వాత కళ్యాణి రహస్యంగా ఇందిరతో.

"ముందుగా వాళ్ళంత వాళ్ళే కబురంపడం, మధ్య వర్తులద్వారా ప్రయత్నించడం చూస్తే నాకూ అనుమానం గానే వుంది కళ్యాణీ. అవన్నీ ఆడపిల్ల తండ్రి చేసే ప్రయ త్నాలు మరి. అయినా ఎవరో కొందరు మోసగాళ్ళను చూచి అందర్నీ అనుమానించకూడదు. మంచివాళ్ళే నేమో? ఎలాగో నీగురించి తెల్సి, బింకం దేనికని సూటిగా కబురంపారేమో?"

"అంతే కావచ్చు. ఇంతకాలం తగిన పిల్ల దొరకక అన్వేషిస్తున్నాడేమో! ఊరికే అనుమానపడకు," అన్నాడు వెనుకనుంచి అంతా విన్న మురళి. అంతతో సంభాషణ ఆగిపోయింది.

ఒకనాడు ఆ ఎదురు చూస్తూన్న పెళ్ళివారు రానే వచ్చారు.

"పెళ్ళికొడుకు అన్నా, వదినా మాత్రమే వచ్చారు; అతడు రాలేదు కళ్యాణీ," అంది ఇందిర కళ్యాణి గదిలోకి వచ్చి.

శ్రద్ధగా డ్రెస్ చేసుకుంటూన్న కళ్యాణి కొంచెం కల వరపడింది. ఓ పావుగంట పోయాక తల్లితోబాటు, అందరూ కూర్చున్న హాల్లో అడుగెట్టి, వెళ్ళి పెద్దన్నయ్య ప్రక్కన కూర్చుంది సోఫాలో. ఎందుకో అకారణంగా గుండెలు టకటకా కొట్టుకో నారంభించాయి. "ఏం ప్రశ్న లడుగు తారో యేమో? వాళ్ళు భార్యాభర్త లిద్దరూ గ్రాడ్యుయే ట్సట. ఇద్దరూ ఉద్యోగం చేస్తున్నారట. మంచి స్టయిలిష్‌గా వున్నారు. ఆవిడ టకటకా ఇంగ్లీషులో మాట్లాడేస్తోంది నాన్న గారితోను, అన్నయ్యలతోనూ. బాబోయ్, నాన్నగా రెదుట నోరే ఎత్తలేని నేను, అన్నయ్యలతోకూడా భయ పడ్తూ మాట్లాడే నేను యిహ వాళ్ళముందసలు నోరెత్త గలనా?" అనుకొంటూన్న కళ్యాణికి శరీరమంతా చమట పట్టేసింది. అలా నేల చూపులు చూస్తూన్నదల్లా "ఉద్యో గం ఏమీ చెయ్యటంలేదా? వూరికేనే వున్నావామ్మా?" అన్న ప్రశ్నవిని ఒక్కసారి అదిరిపడింది. తలెత్తబోయింది కాని, ఆ తల కేమొచ్చిపడిందో మరి ఎంత ప్రయత్నిం చినా పైకి లేవలేదు. సమయానికే ఈ కంఠస్వరం

కూడా ఎక్కడికి పారిపోయిందో, ఎక్కడా అయిపు లేదు.

"ఉద్యోగం అవసర మేముందండీ? ఏదో సరదాగా చదివించాం. ముందు ముందు భర్త చెయ్యాలనుకుంటే చేస్తుంది;" కూతురి తరఫున పద్మనాభం చెప్పాడు.

"నీ పే రేమిటమ్మా, ఏం చదువుకున్నావమ్మా?" అని పాత ధోరణికాక 'ఉద్యోగం చేస్తున్నదా, వుళ్ళేలగలదా?' అనే కొత్త ధోరణిలో ప్రారంభమయ్యాయి! 'పోనీ, తెలుగు లోనే ప్రారంభించింది కొంతలో కొంత మేలు,' అని లోలోన తృప్తిపడింది కళ్యాణి.

"అమ్మాయికి వంటంతా వచ్చునాండీ?" ప్రతి చదువుకున్న వధువు యొక్క తల్లీ ఎదుర్కొనవలసిన సామాన్య గడ్డు ప్రశ్న!

"సందేహమా? ఇవ్వాళ మీరు రుచిచూడబోతున్న వంటకా లన్నిటిలో అమ్మాయిచెయ్యి వుంది. కావలిస్తే అడగండి, చెప్తుంది;" నవ్వుతూ సమాధాన మిచ్చింది కమల.

"అబ్బే, అవసరం లేదండి. ఊరికేనే అడిగాను," అంది ఆవిడ.

కళ్యాణికి మాత్రం లోలోపల చిరాకు కలిగింది. 'ఛ,

దానికల్చరంతా ఎక్కడ తగులడింది? చదువుకుంటే మాత్రం సంసారి కుటుంబాలలో పిల్లలకు పనీ పాటా నేర్పుకోరా?' అన్నయ్యలూ వదినలూ వాళ్ళకు చేస్తూన్న అతిమర్యాదలు మరీ జుగుప్సాకరంగా కన్పించాయి. 'ఎంత పెళ్ళివారైతే మాత్రం మరీ అంత అడుగులకు మడుగులొత్తాలా? అయినా అదికూడా నాలా ఒకప్పుడిలా పెళ్ళిచూపుల బాధ అనుభవించే వుండుంటుంది. ఈ మాత్రందాని కింత భయందేనికి?' కళ్యాణి మనస్సులో కలిగిన ఈ విసుగుదల, చికాకుల ఆలోచనలో సిగ్గు మాయమైపోయి భూమి కంటుకుపోయిన తల లేచి యథాస్థానం పొందింది.

"సంగీతం వచ్చాండీ అమ్మాయికి?" మరో ప్రశ్న.

శ్రీహరి కలుగజేసుకున్నాడు: "అలా కూర్చున్నావేమిటి కళ్యాణీ? ఏదో అడుగుతున్నారు, సమాధానం చెప్పు."

ఆ అన్నయ్య గదమాయింపుకి భయపడినట్లుంది. "వచ్చునండీ." అంది మెల్లగా కళ్యాణి. 'హమ్మయ్య. బాగానే వున్నాను. కంఠం ఏమీ అయిపోలేదు' అనుకొని తృప్తి పడింది కళ్యాణి, కంఠం సవరించుకుంటూ.

"వోకలా, ఇన్‌స్ట్రుమెంటలా?"

"వీణ వాయిస్తానండీ," అంత ధైర్యంగా చెప్పగల్గుతున్నందుకు తనలో తనే మురిసిపోయింది.

"వాయించు వింటాం."

'తప్పుతుందా, ఖర్మ! భగవంతు డెందు కేర్పాటు చేశాడో ఈ పెళ్ళిచూపులు?' మెల్లగా లేచి వీణదగ్గఱ కూర్చుంది. రోజూ నిమిషంలో కుదిరివచ్చే శ్రుతి పదినిమిషా లకుకూడా సరిగా కుదరలేదు. ఎలాగో శ్రుతి చేసుకొని వాయించబోయేసరికి వ్రేళ్ళు తేలిపోవడము మొదలెట్టాయి. నాదం బాగా రానేలేదు. తాళం తడబడిపోయింది. ఏ వారం రోజుల క్రితమో భోజనం చేసినట్టు, శరీరమంతా నీరసపడి పోయింది. తనవాయిద్యం తనకే నచ్చలేదు. మహావిద్వాంసు రాలుకాకపోయినా, శ్రవణానందకరంగా వాయించగల నేర్పు వుంది. మరి ఈ రోజు ఆ నేర్పు ఎక్కడికి ఎగిరి పోయిందో!

"చాలా బాగుందమ్మా! వింటూంటే నిద్ర వస్తోంది నాకు," అంది సదరు పెండ్లికుమారుడి వదినగారు! ఆమె పేరు 'సుగుణ' అట.

చివుక్కుమంది కళ్యాణికి! ఎంత అవహేళన?

"లైట్ మ్యూజిక్ వచ్చా?"

ఈసారి తెగించింది. "రాదండీ" కావాలనే అబద్ధ మాడింది.

"మా మఱదికి హిందీపాట లంటే ఇష్టంలెండి, అందు కడిగాను."

"హిందీ అసలు రాదండీ నాకు." మరో అబద్ధం.

"మరీ అంత సింపుల్‌గా వున్నావేమిటి? మా మఱదికి 'ఫాషన్'గా వుండి ధైర్యంగా మాట్లాడే పిల్లలంటే ఇష్టం."

విస్తుబోయి చూచింది కళ్యాణి.

"నా దగ్గఱ మా మఱదికి చాలా చనవులే. నాకు తన విషయాలూ, అభిప్రాయాలూ అన్నీ చెప్తాడు. అతడు గెజిటెడ్ ఆఫీసర్. ఉద్యోగం చేస్తున్నది దుర్గాపూర్. అటు వంటి ఇంటర్‌నేషనల్ సిటీలో నిత్యం రకరకాల ప్రజలతో ఆఫీసర్లతో చెయ్యిచెయ్యి రాచుకు తిరగవల్సుంటుంది? ఇలాటి పాతపద్ధతులు పనికిరావు. చాల 'మోడరన్'గా వుండాలి. 'సోషల్'గా తిరగాలి."

ఒక్కసారి జల్లుమంది కళ్యాణి గుండె. వేషంలోనూ, నాలుగువీధులు చుట్టబెట్టి రావడంలోనే వుందన్నమాట, ఫాషనంటే. మరి ఈ శల్యపరీక్షలూ, పిచ్చి ప్రశ్నలూ, సంగీతం దగ్గరనుంచీ పాడి విన్పించమనడమూ పాత పద్ధతు లని తెలియలేదు కాబోలు ఈ వన్నెల విసనకర్రకు!"

భోజనాలకు లేచారు. ఇక భోజనం చేస్తున్నంత సేపూ ఆ సుగుణ అవిరామంగా మాట్లాడ్తూనేవుంది. ఎవరిమట్టుకు వారికే చెవులు పాడైపోతాయన్నంత భయం వేసింది. ఆమెకూ భర్తకూ టేబులుకు ఒకప్రక్క వడ్డించారు. మరో

ప్రక్క శ్రీహరి, భార్యా! మూడవప్రక్క మురళీ, ఇందిరా. నాల్గవవైపు పద్మనాభమూ, కమలా కూర్చోవడానికి ఏర్పాట్లు చేశారు. కళ్యాణీ, మరొక దూరపుబంధువూ వడ్డన చూస్తున్నారు. "భర్తప్రక్కన కూర్చోవడం 'ఎటికేట్' కాదండి. మరొకరి ప్రక్క కూర్చోవడం మర్యాద." అంటూ చటుక్కున సుగుణ లేచి మురళి ప్రక్కకుర్చీలో కూర్చుంది. విస్తుపోయిన ప్రేక్షకులందరూ తేరుకోవటానికి ఐదు నిమిషాలు పట్టింది. ఆసందడిలో కళ్యాణి ప్రక్కగదిలోకి జారుకుంది. కళ్యాణిబదులు ఇందిర వడ్డన కుపక్రమించింది. పాపం వేణుగోపాల్ ప్రక్కకుర్చీ ఖాళీగానే వుండి పోయింది!

"అయితే అబ్బాయి పేరు రాధాకృష్ణాండీ? ఆయన కూడా వస్తే యింకా సరదాగా వుండును. మీ కలుపుగోలు తనం నాకు చాలా నచ్చింది." అంటూ పద్మనాభయ్య అసలు విషయాలలోకి దిగాడు భోజనం కానిస్తూ. మను షులు డబడబా మాట్లాడే తీపిమాట లన్నిటిలోనూ తేనె వుందని భ్రమిస్తా డాయన; లౌక్యం అంతగా తెలియదు.

"అక్కరలేదండీ, నాకు నచ్చితే అతడికి నచ్చినట్టే." అంది సుగుణ.

"ఓహో, సంతోషం. మీ కత డంత గౌరవ మిచ్చా

డంయింటినుంచి వచ్చినా, అటే పరాయి త్తవారింటిలో అంత బాగా కలిసిపోయారన్నమాట. సందేహంలేదు; మా అమ్మాయికూడ మీలో కలిసిపోతుంది. ఇంతకూ తమకు అమ్మాయి నచ్చినట్లేనా?"

"ఆఁ! ఏదో కొంచెం ఒకచాయ తక్కువైనా, సన్నంగా వున్నా ఫర్వాలేదులెండి. పిల్ల అందంగానే వుంది. మీ సంబంధం వచ్చినదగ్గర్నుంచీ అక్కడ మాకు పోటీలు మరీ ఎక్కువైపోయాయండీ. సమాధానం చెప్పలేకుండా వున్నాము. నలభై యిస్తామని ఒకరూ, యాభై యిస్తామని ఒకరూ, సరే, మీ అమ్మాయి చదువుకున్నదీ, మంచి సాంప్ర దాయం అని యిక్కడి కొచ్చాము."

పక్కగదిలోనుంచి వింటూన్న ఆమెకు హఠాత్తుగా అతని కంఠం వినిపించింది!

"ఇంతకూ మీ రెంత యిస్తారో చెప్పారుకాదు."

"చెప్పడాని కేముందీ; ఓ యిరవైకంటె ఎక్కువ యిచ్చుకోలేము. కాని అమ్మాయి చదువూ, రూపమూ, గుణమూ, కుటుంబ సాంప్రదాయమూ ఆలోచించాలి మీరు." అన్నాడు పద్మనాభం.

"అవన్నీ సరే అనుకోండి. కాని ఈ రోజుల్లో డబ్బు ప్రధానం కదా, మాకు అక్కడే యాభైయిస్తామంటే మీరు

మరీ అందులో సగం చెప్తారేమిటి? అంతకంటె ఎక్కువ చెప్పాలికాని!" అంది సుగుణ.

"మీ రలాగంటే ఎలా? ఎలాగో మీరు పని కానివ్వాలి. ఇంకొక్క అయిదు వేసుకోండి పోనీ. అంతకంటె యిచ్చుకోలేను."

"మరి మీ రలాగంటే మా మఱదికి చెప్పిచూడాలి; ఏమంటాడో మరి?"

"చెప్పవలసిన బాధ్యత మీది మరి." అంది కమల కలుపుగోలుతనంగా. "మీరూ మరోయింటినుంచి ఆ యింటికి వెళ్ళినవారే కదా; మనం మనం ఒకటి."

"అయ్యో కాదండీ మరి? ఆ మాటకొస్తే నాకసలు కానీ కట్నం పుచ్చుకోలేదు. 'నీ అందం చూచి అన్నయ్య వూరికే వరించాడు. నీలాటిపిల్లే వుంటే నేనూ అలాగే చేద్దునేమో!' అంటుంటాడు మరిది నవ్వుతూ; కాని అందరూ ఒకలాగే వుంటారండి మరి? మావారు నా అదృష్టంకొద్దీ వూరికే చేసుకున్నారు. మరి మఱది పెద్ద ఆశలమీ దున్నాడు. ఈ కట్నంతో ఒక మేడ కట్టుకోవాలనీ, ఒక ఎయిర్ కండిషన్ గది ఏర్పాటు చేసుకొని, కారు కొనుక్కోవాలనీ రకరకాల కోరికలు పెట్టుకున్నాడు. మీ రిచ్చేదాంట్లో అల్లుడికోరిక ఒకటైనా తీరవద్దూ?"

"మరి మీ రలాగంటే చెప్పలేం." అన్నాడు పద్మనాభం.

భోజనాల దగ్గరనుంచి లేచారు. కాస్సేపు పోయాక తిరుగు ప్రయాణమయ్యారు సుగుణా, వేణుగోపాల్ లు.

"నచ్చజెప్పి చూస్తాను మా తమ్ముడికి. అయినా అతడు నా తమ్ముడుకాని, కుమారుడు కాదు చూడండి. అతడికి యింకా ఎక్కువిచ్చేవాళ్ళుంటే పోగొట్టుకొని మీ సంబంధం చేసుకుంటాడని అనుకోను." అన్నాడు వేణుగోపాల్ వెళ్తూ వెళ్తూ.

సుగుణకు మంచి వందరూపాయల చీరా, జాకెట్టు గుడ్డా సిద్ధం చేస్తోన్న తల్లిదగ్గఱకు వెళ్ళింది కళ్యాణి. "ఇంకా ఏమీ కుదరనిదే అంత ఖరీదైన చీరలలా పెట్టడ మెందుకమ్మా?" అనడిగింది మెల్లగా.

"కుదిరినా కుదరకపోయినా అది ఆచారమమ్మా." అంది కమల నవ్వుతూ.

"వద్దు, ఇలా ఎందరొస్తే ఎన్ని పెట్టి పంపిస్తావ్! అయితే అవుతుంది. లేకుంటే లేదు. మరీ యింత ఖర్చా? అయినా అవుతుందని నాకు నమ్మకం లేదు. నాకేమిటో వెగటుగా వుంది వాళ్ళను చూస్తోంటే."

"నోరు మూసుకుని నీ గదిలోకి వెళ్ళు. నా కాట్టే సల

హాలు చెప్పక. అయినా నీ కసలు ఏదీ కుదరడం యిష్టం లేదు. ఇలాగే వుండిపోవాలనా ఏమిటి? అతడా మన్మథుడు; ఉద్యోగస్థుడు. పెద్దలు చూస్తే తను చూడక్కర్లేదన్నాడట. ఎంత బుద్ధిమంతుడు!"

గబగబా అక్కడినుంచి వెళ్ళిపోయింది కళ్యాణి, ఆ స్తోత్రం వినలేక. వెనక మరో బుద్ధిమంతుడు కూడా యిలాగే సెలవిచ్చినట్లు ఆమె అప్పుడే మర్చిపోయినట్లుంది.

స్టేషన్‌నుంచి తిరిగివచ్చిన అన్నయ్య మురళిగదిలోకి వెళ్ళింది కళ్యాణి సుడిగాలిలా. "అయ్యిందా వెళ్ళేవరకూ కాళ్ళు ఒత్తడం! ఇహనైనా నామాటేమైనా కాస్త విన్పించుకొనే తీరిక చిక్కిందా?" అనడిగింది కోపంగా.

"మర్యాదలు చెయ్యకపోతే ఎలాగే మరి? ఏమంటా వింతకూ నువ్వు?"

"నాకు వాళ్ళొద్దూ అని ఖచ్చితంగా అంటాను. అయ్యిందేదో అయ్యింది, కాని ఇహ వాళ్ళసంగతి ఎత్తకండి."

"అదేమిటి?" అప్పుడే అక్కడికొచ్చిన పద్మనాభం, శ్రీహరీ, కమలా- అందరూ ఆశ్చర్యపోయారు.

"ఆ ఠీవీ, దర్పం, ఆ అందం - అతగాడు మీ అల్లుడై తేనేచాలు మీకు." అంది ఆవిడ, సుగుణ వెళ్తూ వెళ్తూ

కూడా. "నీ కేమిటి యిలా పాడుబుద్ధి పుట్టింది?" అంది కమల కూతురిపై చికాకు తెచ్చుకుంటూ.

"సుగుణ కాదు దుర్గుణ, అను సరిపోతుంది. చూడ గానే తెల్సిపోయింది నా కావిడ తత్వ మెలాటిదో. ఆవిడ చెప్పినంత 'ఫార్వర్డ్' గా నే నుండనూలేను. మరీ అంతగా వదిన నేత్రాలనే చూస్తూ వదిన మెదడుతోనే ఆలోచించే అప్రియోజకుడు నా కక్కరనూలేదు."

కూతుర్ని పరీక్షగా చూచాడు పద్మనాభం. "వాళ్ళ ప్రశ్నలూ వాటితో విసుగెత్తినట్టున్నావ్. తర్వాత మాట్లాడు కుందాంలే. దాన్ని కాస్సేపు ఒంటరిగా వదిలెయ్యండి," అంటూ అందర్నీ క్రిందకు తీసుకుపోయాడు పద్మనాభం.

రాత్రి భోజనాలదగ్గర "ఏం నిర్ణయించుకున్నా వమ్మాయ్?" అనడిగాడు శ్రీహరి చెల్లెల్ని.

"నా నిర్ణయ మెప్పుడూ ఒక్కటే అన్నయ్యా."

"ఏమి టసలు నీ అభ్యంతరం?" సూటిగా అడిగాడు పద్మనాభం.

"అన్నీ అభ్యంతరాలే. అతడికి తల్లీ, అక్కచెల్లెళ్ళూ వుండగా ఒక్క అన్నా వదినలే రావడమేమిటి చూచుకోవ టానికి? అసలు ప్రాముఖ్యత తల్లిదికదా! అతడు పెద్దవాడు; ద్యోగం చేస్తున్నవాడు. ఒక వ్యక్తిత్వమంటూ ఏర్పడ్డ

వాడు, పూర్తిగా బాధ్యత వదిన కొదిలేసి కళ్ళు మూసు కూర్చోవడమేమిటి, అసహ్యంగా? పైగా పాతిక, యాభై అంటూ ఆ బేరసారా లేమిటి, గొడ్లబేరాలకుమల్లే?"

"ఒక్కో కుటుంబం పద్ధతి ఒక్కోలాగుంటుంది. అయినా అవన్నీ పెద్దవాళ్ళాలోచించవలసిన విషయాలు, నువ్వుకాదు." అన్నాడు శ్రీహరి తీక్షణంగా.

"ఒప్పుకో నన్నయ్యా. నేను వెళ్ళబోయే కుటుంబం విషయం నేనుకూడా ఆలోచించడం అవసరం. వున్నంత సేపూ ఆవిడ మాటలూ, ప్రవర్తనా అన్నిటిలోనూ నాకు అపసవ్యతే కన్పించింది. ఆలోచించిచూస్తే మీకూ అసహ్యం గానే కన్పిస్తుంది".

"ఆడవాళ్ళు అసూయాపరులు!" అని నవ్వాడు మురళి.

"అంత సూక్ష్మగ్రాహిణులుకూడా!" ఖంగుమంది కళ్యాణి కంఠం. "ఇంటి కోడలి కుండవలసిన చనవూ, అధి కారాలకూ, వెకిలితనానికీ భేదం తెలియనిదాన్ని కాను నేను. ఆవిడ 'ఎటికేట్'లు పాటించవలసింది, టీపార్టీ - డిన్నర్ పార్టీలలోకాని యిటువంటి సభ్యకుటుంబాలలోకాదు. మరది యొక్క ప్రత్యేకతలు వదిన చెప్పవలసిన తీరు అదికాదు." అంటూనే అక్కడినుంచి లేచి వెళ్ళిపోయింది.

"నా ఖర్మ,యిలాంటి పెంకెఘటం నాకూతురవ్వడం."

అని కమల నుదురు కొట్టుకొంది. "ఇంతకూ ఈవిడ పెళ్ళి చేసుకోబోయేది ఆవిడనా, ఆవిడ మరదినా?" అనికూడా అంది.

"ఊరుకో కమలా, అమ్మాయి మాటలలో అర్థం లేక పోలేదు." అని పద్మనాభం గంభీరంగా అనడం వెళ్ళిపోతున్న కళ్యాణి వినకపోలేదు.

ఆతర్వాత కమల నాల్గురోజులు మాట్లాడలేదు కూతురితో. ఒకనాడు కళ్యాణి భోజనానికి డైనింగ్ హాల్లోకి వెళ్తూండగా వంటగదిలోనుంచి మెల్లగా మాటలు విన్పించాయి.

"మనమ్మాయి చాలా అదృష్టవంతురాలమ్మా." అది మురళి కంఠం.

"ఏమిటి?" కమల అడుగుతోంది.

"దుర్గాపూర్ నుంచి నాస్నేహితు డొకడు వ్రాశాడు - అత డొకసారి రిజిష్టర్డ్ మారేజ్ చేసికొని ఎవరోపిల్లని వదిలేశాడట. అతనుకూడా పేరుకుతగ్గట్టు సాక్షాత్తూ రాధా కృష్ణుడేనట. అతడి అన్నా వదినాకూడా తక్కువ వాళ్ళేం కాదట. అసలు మనం ఏవిధంగానూకూడ ఆలోచించకూడని మనుష్యులట. ఇంకా చాలా వ్రాశాడనుకో, నీతో చెప్ప కూడదు. చిన్నదైనా కళ్యాణి చాలా... తెలివైనదే."

ఏమీా విననట్టు చటుక్కున వంట గదిలో కెళ్ళింది కళ్యాణి. సంభాషణ ఆగిపోయింది.

"ఏం? ముహూర్తం పెట్టించమని మీా దుర్గుణ లెటర్ వ్రాసిందేమిటి?" అంది హాస్యంగా. మురళి నవ్వి వూరు కున్నాడు. తల్లి ముఖం తిప్పుకుంది. అప్పటినుంచీ పోస్టులో ఏ ఉత్తరమొచ్చినా 'మీా దుర్గుణ వ్రాసిందేమో!' అని వుడి కించటం పరిపాటైంది కళ్యాణికి.

అడుగడుగునా యిటువంటి మోసా లెదురవ్వడంతో బెదిరిపోయి అసలు కూతురి పెళ్ళివిషయం ఎత్తడం మానే శాడు పద్మనాభం. సునాయాసంగా ఒక ఏడాది గడచి పోయింది. కమలకు మాత్రం నిద్ర పట్టడంలేదు. రోజుకు పదిసార్లయినా కూతురి కింకా పెళ్ళి కాలేదనే బెంగ వ్యక్త పర్చుతుంటూంది. ఇక భర్తా, కొడుకులు కళ్యాణిపెళ్ళి చెయ్య రని నిశ్చయించుకుందో యేమో, తన అన్నగారికి కబురు పంపింది. నెల్లాళ్ళ క్రితం ఓనాడాయన ఒకబ్బాయిని వెంట బెట్టుకొచ్చాడు. బి. ఎల్. పాసై ప్రాక్టీసు చేస్తున్నాడట, హైదరాబాద్‌లో. కొంచెం యిటువంటి పరీక్షలలో రెండు మూడుసార్లు అనుభవం సంపాదించడంవల్ల కళ్యాణికూడా నదురూ బెదురూ లేకుండా కూర్చుంది.

చిరునవ్వుతో ఒక స్నేహితురాలితో మాట్లాడ్తున్నట్టు

చదువూ, హాబీలూ, అన్నీ చాలా సరసంగా అడిగా డతడు. కళ్యాణికూడా సరదాగానే సమాధానాలు చెప్పింది. 'ఫర్వా లేదు, మంచివాడే.' అనే సదభిప్రాయం ఏర్పరచుకుంటూండ గానే అయిష్టమైన పని జరిగిపోయి, సద్భావమంతా చెదిరి పోయింది.

"చూడండీ, మా స్నేహితు డొకడికి వివాహమైంది. సెవెంత్ ఫారం పాసైందని చెప్పి పెళ్ళిచేశారు. ఆమెకు ఏ బీ సీ డీలు' కూడా రావు. అంచేత మీా చదువును నేను పరీక్ష చేసుకోవాలి." అన్నాడు.

ఒక్క కళ్యాణికే కాదు, ఆమాటలు విన్న అందరి ముఖాలూ అప్రసన్న మయ్యాయి. అందరికంటె ముందు కళ్యాణే ఆ షాక్ నుంచి తేరుకుంది.

"యస్. యూ కెన్ ఎగ్జామిన్ మై ఇంగ్లీష్ నాలెడ్జి (అలాగే, ఇంగ్లీషులో మీారు నా తెలివిని పరీక్షించుకో వచ్చు)." అంటూనే టేబిల్ మీాద ఇంగ్లీషు పేపరు తీసి చక చకా చదివేసింది. "అర్థంకూడా చెప్పమంటారా?" అంటూ చెప్పేసింది. పెన్ను తీసి పేపరుమీాద ఇంగ్లీషులో అతడిపేరు రాసింది.

"ఇదిగో మీా పేరు పూరూ ఇంగ్లీషులో వ్రాసే శాను. ఇంకా ఏం వ్రాయమంటారో చెప్పండి."

అతడు చకితుడై గ్రుడ్లప్పగించి చూడడం తప్ప ఏమీ మాట్లాడలేకపోయాడు. అతడే కాదు, అందరి పరిస్థితీ అలాగే వుంది.

'ఏమండీ, నా చదువుమీద నమ్మకం కలిగిందా? నేను నచ్చానా మీకు?' చిలిపిగా అడిగింది కళ్యాణి.

అతడు బిత్తరపోయాడు.

"నా డిగ్రీ తీసుకొచ్చి చూపించమంటారా పోనీ?"

"నోనో, వద్దండీ". అతడు ఖంగారుగా అన్నాడు. "మీరు మరీ 'అఫెండ్' అయ్యా రనుకుంటాను?" అన్నాడు కళ్యాణిని పరీక్షగా చూస్తూ.

"లేదండీ, దాని కేముందీ? అనుమానాలు తీర్చేసుకోవడం మంచిదేగా? అయితే మీకు నేను నచ్చానా?"

"ఇంకా అనుమానమా?" సిగ్గుమిళితమైన చిరునవ్వుతో అన్నాడు.

"ఆల్ రైట్; మరి నేనుమిమ్మల్ని పరీక్షించుకోవద్దా?" అంది సీరియస్‌గా.

అతడు బిక్కముఖం వేశాడు.

"మీ డిగ్రీ తీసుకొచ్చారా మరి మీతో? చూడందే నాకు నమ్మకమెట్లా?"

అతడి నేత్రాలు విపరీతంగా చలించాయి.

"పోనీండి, ఏదీ, ఇంగ్లీషులో ఓ పది నిముషా లేమైనా మాట్లాడండి. మీ ఇంగ్లీషూ, తెలివీ అందులో తెల్సుకుంటాను."

"అదేమిటి? నన్ను మీరు పరీక్షించటమా?" ఎలాగో ధైర్యంచేసి అడుగ గలిగాడు.

"ఏం, నన్ను మీరు పరీక్ష చేసుకున్నట్లే. వింత ఏముంది?" అమాయకంగా అడిగింది.

"మగవాళ్ళు పరీక్ష చేసుకోవడం క్రొత్తకాదు." అన్నాడు సగం బెదుర్తూనే.

"అదేమో నాకు తెలియదు కాని, డబ్బిచ్చి కొను క్కొనే వస్తువును మంచి చెడ్డలు తెలియకుండానే కొనేసు కుంటారా?"

"ఆ!" అంతకంటె మాట్లాడలేకపోయాడు.

"సరే; మీరు నాకు నచ్చలేదు. వెళ్ళిరండి నమస్తే." అంటూ లేచి లోపలి కొచ్చేసింది వచ్చేనవ్వు నాపుకొంటూ.

"ఇక ఈ పెంకెదానికీ జన్మలో పెళ్ళి" కాదని నిశ్చయించుకుంది కమల.

"బాగానే బుద్ధి చెప్పిందిలెద్దూ. అందుకే మే మెవరమూ కలుగజేసుకోలేదు." అన్నారు తండ్రీ కొడుకులు. ఆ తర్వాత వారంరోజులవరకూ సాధిస్తూనేవుంది కమలకూతుర్ని.

"పోనీలేమ్మా. ఇలాటి చెత్తరాయుళ్ళతో పెళ్ళవడం కంటె, కాకపోతేనే మంచిది. మళ్ళీ యిటువంటి అవకాశం కలుగుతుందో లేదో అన్నట్లు రాజసం ఒలకబోస్తూ ఠీవిగా కూర్చోవటం, చెత్తప్రశ్నలు వెయ్యడమూను — అసహ్యం నాకు." అంది కళ్యాణి.

గతంలో జరిగిన ఈ పెళ్ళిచూపుల సంకలన మంతటినీ తెరలు తెరలుగా గుర్తుకు తెచ్చుకోవడంతో అలలు అలలుగా నవ్వువచ్చింది కళ్యాణికి.

మళ్ళీ ఈ రాబోయేవా రెలావుంటారో! మళ్ళీ ఓ చిన్న గాలిదుమారం రేగుతుంది కాబోలు! ఛ. ప్రేమించి పెళ్ళి చేసుకున్నవా ళ్ళెంత అదృష్టవంతులు? ఈ వెధవ తతంగ మంతా వుండదు వాళ్ళకు.

"ఏమిటమ్మోయ్? నీలో నువ్వే నవ్వుకుంటున్నావ్? కాస్త మాక్కూడా చెబుదూ." ఇందిర ప్రవేశంతో కళ్యాణి ఆలోచనల కంతరాయం కల్గింది.

"ఏంలేదు వదినా, సినిమాలో విషయమేదో గుర్తుకు వచ్చింది." అంటూ లేచింది.

భోజనాల దగ్గర అసలుసంగతి మెల్లగా కూతురి చెవిన వేశాడు పద్మనాభం. "వెనుక మేం గుంటూరులో వుండే టప్పుడు — అప్పుడు ఇంకా నువ్వు పుట్టలేదు - రఘురా

మయ్యగారని నా కో ముఖ్యస్నేహితు డుండేవాడు. ఆయన కొడుకుపేరు శ్రీనివాస చక్రవర్తి — అప్పుడు ఏడేళ్ళ వాడు, ముద్దొచ్చేవాడు. ఇప్పుడు ఐ. ఎ. ఎస్. అయి ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడట. ఇప్పుడు సెలవుపెట్టివచ్చి గుంటూర్లో తలిదండ్రుల దగ్గరే వుంటున్నాడట. పెళ్ళి ప్రయత్నాలు జరుగుతున్నాయి. నీ కన్నివిధాలా తగినవాడని నే నను కుంటున్నాను కళ్యాణీ."

కళ్యాణి మౌనంగా వింటోంది.

"ఏ పిల్లను చూచినా అత డేదో ఒకవంక పెడ్తున్నాడని అస లతడిని చూచుకోవడానికి వెళ్ళొద్దని ఆంక్ష పెట్టాడట తండ్రి. చూచుకోవలసిన అవసరంలేదు కూడాను. ఇప్పుడు చూచుకోకపోయినా వుభయకుటుంబాలం ఒకరి కొకరం వెనక బాగా తెల్సినవాళ్ళమే. అంచేత ఇక ఈ పెళ్ళిచూపులతతంగం పెట్టుకోదలచుకోలేదు. అది నీకూ్కడా అయిష్టంగానే వుందికదూ?"

ఆశ్చర్యాన్ని మించిన అనుభూతి పొందింది కళ్యాణి. తన చికాకును అడ్డుగా పెట్టుకొని ఆయన పనిని సమర్థించు కుంటున్నాడు తండ్రి!

"నిన్న మెడ్రాస్‌లో కన్పించాడు రఘురామయ్య. అతడు చెప్పేవఱకూ అతడికొడుకు సంగతి నాకు గుర్తేలేదు.

తెల్సిన కుటుంబాలవ్వడంవల్ల మోసాలూ, విచారాలూ ఏమీవుండవు. అందుకే ఇద్దరం అక్కడే ఒక నిర్ణయాని కొచ్చాం; అన్నివిషయాలూ మాట్లాడుకున్నాం. పైసాకట్నం తీసుకోనేందుకూడ అంగీకరించలేదు. కొడుకును విక్ర యించుకోడట. ఎంత ఉన్నతభావాలు! ... ఈ పదిహేడవ తారీఖునే వివాహం. ఈ క్షణంనుంచీ ఆ ప్రయత్నం మీ దుంటే కాని పనులవ్వవు.” కూతురి సమాధానాని కెదురు చూడకుండానే వెళ్ళిపోయాడు.

విస్మయ విస్ఫారిత నేత్రాలతో చూడడమేగాని ఏమీ మాట్లాడలేక పోయినది కళ్యాణి. ఆ మాటలలో అధికారమూ లేదు, శాసనమూ లేదు; తన స్థిర నిర్ణయాన్ని గంభీరంగా తెలియజేశారు; అంతే ఇక దానికి తిరుగు లేదన్న మాట! తను ఆడింది ఆటగా సాగించే తండ్రిలో- తనను భుజాలపై మోసి పెంచిన అతడి లాలనలో - సంతానం పట్ల మృదుత్వం మాత్రమే ప్రదర్శించే అతడి ప్రేమలో ఇంత కఠినత్వంకూడా దాగివున్నదా? పెండ్లిచూపుల తతం గం విసుగ్గా వుందని కేవలం దానిని తొలగించివేయడంకన్న మార్గంలేదా! నడుస్తున్న బాటపై గోతులు కన్పిస్తున్నా యని, పూర్తిగా కళ్లుమూసుకునడిస్తే ఆ గోతులలో పడి పోమూ ?

తండ్రిగారి నిర్ణయం కళ్యాణికి ఏమాత్రమూ నచ్చ లేదు. ఆ రాత్రి నిద్రపట్టలేదు.

ఉషఃకాంతిలో బద్ధకంగా నిద్ర మేల్కొంటోంది ప్రకృతికాంత. పక్షుల మేల్కొలుపులతో పూలబాలల స్వాగతాలతో మానవలోకం దైనందిన కార్యక్రమంలో అడుగు పెడుతోంది. మందమందంగా వీస్తూన్న ఉదయ పవనాలు కుసుమ సౌరభాలనూ, ఆలయంలోని జేగంటల గణగణలనూ మోసుకొస్తున్నాయి.

పొగడ చెట్టుక్రింద పొందికగా కూర్చుని ప్రాంగణ మంతా తిలకిస్తోంది కళ్యాణి. తులసికోటదగ్గర పూజచేస్తోంది కమల. సుస్నాతయై పట్టువస్త్రాలు ధరించి పవిత్రంగా దేవ తార్చన చేస్తూన్న తల్లి సాక్షాత్తూ లక్ష్మీదేవిలాగే కన్ప ట్టింది కళ్యాణికండ్లకు. కమలకంటె ముందుగానే తులసికోట ప్రక్కనున్న శిరీషవృక్షం. తన కుసుమ సంతానాన్ని ఆ తులసీపాదుకలపై రాల్చి తన భక్తి ప్రపత్తులను వెల్లడి చేసుకొంది. తెల్లని పాలరాతిపై పగడాలు తాపిన చందాన్ని గుర్తుకు తెస్తున్నాయి, వత్తుగా రాలిన ఆ పారిజాతాలు, నందివర్ధనం చెట్ల నిండైన శ్వేతవర్ణ పుష్పాలు; ఒక ప్రక్క కెంపు లీనుతున్న కుసుమాలతో మందారాలు. ఉత్తరపు గోడ పొడవునా సూర్యునికొరకు ఎదురుచూస్తూన్న ప్రొద్దు

తిరుగుడుపువ్వులు, మరోప్రక్క అప్పుడే విడుస్తూన్న తెల్లని ఎఱ్ఱని గులాబీలు! నాల్గుమూలలా త్రాళ్ళ ఆధారాలతో గోడలపై కెగబ్రాకిన కాశీరత్నం పూతీగలు; ఉషఃకాంతిలో రంగు రంగుల, రకరకాల సుమబాలలు! పసిపాపల అమాయక వదనాలను, సుందర యువతీ ముఖారవిందాలనూ గుర్తుకు తెచ్చే పూలభామలు! 'వసంతాగమవేళ రెమ్మ రెమ్మా ఒక పూలపల్లకి.' ఎక్కడో ఎప్పుడో చదివిన వాక్యం ఆ నిర్మల వాతావరణంలో గుర్తుకువచ్చింది కళ్యాణికి. ఎంత సుందరభావం!

పూజ ముగించి ప్రదక్షిణ చేస్తూన్న కమల పొగడ చెట్టు క్రిందికి పరకాయించి చూచింది. "ఎవరూ, కళ్యాణీ?" అంది ప్రశ్నార్థకంగా. అప్పుడప్పుడే విడుగుతున్న చీకట్లలో మనిషి వివరం తెలియక.

"అవునమ్మా, నేనే. నీపూజ మధ్యలో ఆపడ మెందుకని యిక్కడ కూర్చున్నాను. నీతో ఓసంగతి మాట్లాడాలి." అంటూ లేచి దగ్గర కొచ్చింది కళ్యాణి.

పూజ చేసిన పూవులు రెండు తీసిచ్చి కుమార్తె నుదుట పూజాకుంకుమ దిద్దింది కమల ఆప్యాయంగా. ప్రసాదం చేతిలో పెడ్తూ "ఏమ్మా, ఇంతప్రొద్దున్నే లేచావు? ఆ సూర్యు డేదిక్కున ఉదయించనున్నాడో!" అందినవ్వుతూ.

ప్రతిగా నవ్వుతూ "తూర్పుననే ఉదయిస్తాడులే. కాని ఒక్కసారి కూర్చోమ్మా" అంది కళ్యాణి తులసి ప్రక్కన చతికిలపడ్తూ.

"ప్రొద్దున్నే నా కెక్కడ తీరిక కూర్చోవడానికి? అయినా నీకు పనిఏమిటి? మే వందో యాభై యో కావాలేమో. వెళ్ళి మీ నాన్నగా ర్నడుగు." అంటూ కదలబోయింది కమల.

"అబ్బ, కాదమ్మా. ఒక్కసారి విని పో, మళ్ళా అన్నయ్యలు వదిన లొస్తే నీతో యిక చాటుగా మాట్లాడే అవకాశమే వుండదు. వింటే వేళాకోళం చేస్తారు." అంది తల్లి కొంగు పట్టుకుని.

"అయితే త్వరగా చెప్పు ఏమిటో;" వచ్చి కూర్చుంది కమల.

"మరి...మరి కోప్పడకుండా విను. నాకు మీ మాట కాదనాలని కాదు కాని ఒక్కసారి అతడిని చూడాలని వుందమ్మా. ఇదేమంత పెద్ద కోరిక, చెప్పు." జాలిగా తల్లి ముఖంలోకి చూచింది.

ఆ మాటలు వింటూనే కమల వ్రేళ్ళు అప్రయత్నంగా బుగ్గలు నొక్కుకున్నాయి. కళ్ళు పెద్దవిచేస్తూ "ఇదేం కోరిక? సంసారి లక్షణమేనా? వాళ్ళేమో చూచుకోనక్కర్లేదని

గౌరవంగా చేసుకొంటూంటే నువ్విలాగంటావా? బెట్టు సరిగా వుండవలసిన మగవాళ్ళు కదా? వాళ్ళంత పెద్దమనిషి తరహాగా వుంటే - నీ ఫోటో అయినా పంపమనలేదే! నువ్వతడినే చూడాలా? అసలీ పెళ్ళవడం యిష్టం లేనట్టుందే! నాకు చూడగా?"

"ఇష్టాయిష్టా లతడిని నేను చూచిన తర్వాతి మాటలు. అతను ఒప్పుకున్నారంటే నా సంగతి వినేవుంటారు. బాగానే వుంటుందనెవరో చెప్పి వుంటారు. నేను మాత్రం అతడిని చూచుకోవాలి." తాపీగా సమాధాన మిచ్చింది.

"ఆఁ, మరే చెప్పారు. అక్కడికి నువ్వే తిలోత్తమవు. అతడు మన్మధుడూ, నలకూబరుడూ కాకపోయాడు. తల్లీ తండ్రీ ఎవర్ని తెస్తే వాళ్ళని కిమ్మనకుండా చేసుకోవాలి కాని యిదేం పెంకెతనం? నీ బాగోగులు మాకు తెలియవ్వూ? మా కాలంలో మే మెరుగుదుమా యివన్నీ?"

"ఏమిటమ్మా నీ గొడవ? నీ కాలంలోనే కాదు... ఈ కాలంలోకూడా నువ్వెరగని వనేకం నే నెరుగుదును. రోజులు మార్తాయి. దానికేంగాని అమ్మ వైనందుకు ఈ మాత్రం కోరిక తీర్చలేవామ్మా?"

"చిన్నప్పు డెప్పుడో చేస్తే మరి మీ యిష్టప్రకారమే జరుగును. ఇంతదాన్నై ఇంత చదువుకొని, బొత్తిగా

బొమ్మలా ఎలా కూర్చోగలను ? నాకూ్కడా యేవో కొన్ని ఆశలు వుంటాయిగదూ ?"

"ఉంటే మీ నాన్నగార్నే అడుగు. ఆయనదగ్గర నోరు లేవదు మళ్ళీ, నా దగ్గరే ఈ వేషాలన్నీ. నీ పెంకె కోర్కెలు నేను తీర్చలేను." కోపంగా లేచిపోయింది కమల.

"నాన్నగార్నే అడగగలిగితే నీవఱకూ రావడం దేనికో ?" కన్నీళ్ళ పర్యంతమైంది కళ్యాణికి.

"చెడుచదువులూ, పెడబుద్ధులూను." సణుక్కుంటూ నిష్క్రమించింది కమల. అచేతనంగా అటే చూస్తూ కూర్చున్న కళ్యాణి, అలా ఎంతసేపు కూర్చుందో.

"ఏం చెల్లాయ్ ? వసంతోదయం గూర్చి ఏమైనా కవిత్వం వ్రాయబోతున్నావా ?" అన్న చిన్నన్నయ్య మురళి కంఠం విని వులిక్కిపడి చూచింది.

బాలభానుని బంగారు కిరణాలలో మునిగి తేలుతోంది జగం. తన పరధ్యానానికి తానే సిగ్గుపడ్తూ లేస్తూన్న కళ్యాణి తన వెనక కిలకిలలు విని వెనక్కు తిరిగిచూచింది. మందార చెట్టుక్రింద ముఖం కడుక్కుంటూన్న ఇందిర "అంత పర ధ్యాన మొచ్చిందేం కళ్యాణీ! ఈ సుందర వాతావరణంలో ఏసుందరాకారుడైనా తలపుకు వచ్చాడా?"అంటూ హాస్యం చేసింది.

చిరుకోపం వచ్చింది కళ్యాణికి. నీమాట పూర్తిగా కాదనగల సాహసం లేదు వదినా నాకు. అనుభవంవల్ల సెల విచ్చే అభిప్రాయాలుకదా ?"

తన విసురును తనకే త్రిప్పికొట్టిన ఆడపడుచు అతి తెలివికి ఆశ్చర్యపోయింది ఇందిర.

కళ్యాణి మేడమె ట్లెక్కుతుండగా ఎదురైన పెద్ద వదిన "ఏమండోయ్, తమరింత ఉదయమే లేచారు ? ఏదో విపరీతముం దివ్వాళ !" అని పలుకరించింది.

"యేమో మరి, మెలకు వొచ్చేసింది" అంటూ వెళ్ళి పోయింది కళ్యాణి.

ఆఫీసు ఫైల్సు తిరగేస్తున్న పద్మనాభం తుఫానులా లోపలికి ప్రవేశించిన కళ్యాణిని చూచి ఆశ్చర్యపోయాడు. "ఏమమ్మా, ఇంత పెందరాళే లేచావు? పెళ్ళయితే ఎలానూ సాగదు. ఇప్పుడైనా సుఖపడకపోతే ఎలాగ ? నీ కేం పనుంది గనుక అప్పుడే లేవటానికి ?" అనడిగాడు.

'చచ్చు ప్రశ్న ! ప్రతివాళ్ళూ అదేమాట. నేను ఎని మిది గంటలకే కాని లేవకూడదని ఎక్కడైనా రాసివుందే మిటి ?' అని లోలోన చిరాకుపడింది కళ్యాణి. తండ్రికి దగ్గరగా కుర్చీలాగి కూర్చుని ఏదో చెప్పేలోగా కళ్యాణి నేత్రాలకు అప్పుడే అటుగా వస్తూన్న తల్లి కన్పించింది.

భర్తమాటలు చెవిన పడటంవల్ల ఆమెముఖం అప్రసన్నంగా వుంది.

"కాస్త ముందుగా లేచినంత మాత్రాన మరేం అరిగిపోదులెండి మీ కూతురు. అసలు మీ గారాబమే దాని పెంకెతనా న్నింతవరకూ తెచ్చింది." అంది కూతుర్ని చురచురా చూస్తూ.

కళ్యాణికి కోప మొచ్చేసింది. "అందుకేగా త్వరలో ఇంట్లోంచి తరిమెయ్యాలని చూస్తున్నావు? ఆ తర్వాత అరచి గీపెట్టినా ఈ రోజులు రావు. ఇక్క డున్నన్నాళ్ళా యింతే. కనుమరుగై తేమాత్రం ఎక్కడ లేని ప్రేమలూ కురిసి పోతాయి నీలాటివాళ్ళకి." దురుసుగా అనేసి లేచి వెళ్ళిపో బోయింది.

"వెళ్ళిపోతావేం? తండ్రితో ఏదో మంతనాలకు వచ్చావుగా?" అంది కమల కొంచెం కరిగిపోతూ. 'పాపం నిజమే. పెళ్లయ్యాక ఈసుఖ ముంటుందా? నా యిష్టమై నప్పుడల్లా దానిని చూచుకోగలనా?' అన్పించిం దామెకు.

"ఏం కావాలమ్మా? ఇలారా," అని పిల్చాడు పద్మ నాభం కూతుర్ని.

"ఏంలేదు నాన్నా. నాకో యాభై రూపాయలు కావాలి. మా స్నేహితుల మందరం యివ్వాళ అమరావతి

వెళ్ళి చూచి రావా లనుకున్నాం. మళ్ళీ రేపు సాయంత్రానికొచ్చేస్తాం.” అంది కళ్యాణి.

మాట్లాడకుండా డెభ్భై రూపాయలు తీసిచ్చాడు పద్మనాభం. సంతానం ముగ్గురిలోనూ చిన్న దవ్వడం వల్లనో ఎందుచేతనో, కొడుకు లిద్దరికంటె కూతురు కళ్యాణిపైననే అతడికి చాలా అభిమానం. ఆమె ప్రవర్తనపై అతడి కెక్కడలేని నమ్మకం. ఆమె విజ్ఞానంపై అమిత గౌరవం.

ఆ దృశ్యం చూడగానే కమల కోపం నెత్తికెక్కిపోయింది. “అదుగో అదే నే ననేది. అది యాభై అడిగితే మీరింకో పదెక్కువిచ్చారు. ఇంత విచ్చలవిడిగా పెంచితే రేపు ఆ వెళ్ళినకుటుంబంలో యిది ఇమడగలదా అని? చదువుకున్నన్నాళ్ళూ తిరిగింది చాలదూ? చదువుమాని యింట్లో కూర్చున్నాక కూడా ఈ పిక్నిక్ లూ, షికార్లూ ఏమిటి ఇరవై ఏళ్ళు నెత్తి కొచ్చిన పిల్లకి? ఈ ఆడవాళ్ళంతా బయల్దేరిపోతే వీళ్ళ ప్రయాణం క్షేమంగా సాగుతుందన్న హామీ ఏమిటి?”

తేలికగా నవ్వేశాడు పద్మనాభం. “బి. యస్సీ. పాసైన నీ కూతురి కేం ఫర్వాలేదు కమలా. వెళ్ళిరానీ. కాని వివాహానంతరం వాళ్ళ అదృష్ట మేమిటో మనకు తెలియదుకదా? ఈ నాల్గురోజులైనా వాళ్ళ కోరికలు మనం తీర్చకపోతే

ఎవరు తీరుస్తారు చెప్పు ? ఊం. అంచేత దాన్నేమీ అనకు. వెళ్ళిరామ్మా కళ్యాణీ," అంటూ సర్ది చెప్పేశాడు పద్మనాభం. తనలో తను గొణుక్కుంటూ నిష్క్రమించింది కమల. ఆమె కేమిటో ఎవ రేంచెప్పినా సబబుగానే తోస్తుంది, పాపం.

ప్రొద్దున్నే హడావిడిగా వచ్చిన కళ్యాణిని చూచి కొంచెం ఆశ్చర్యపడి పోయింది పద్మ. స్నేహితురాం డ్రిద్దరూ గదిలో కూర్చుని మంతనాలు సాగించాక ఒక అరగంటలో బయల్దేరారు.

"అబ్బ, ఈ పంజాబీడ్రెస్‌లో నువ్వు రోజూకంటె ఆకర్షణీయంగా వున్నావే కళ్యాణీ. అబ్బా - ఈ రెండు జడలు నీ కెంత అందం తెచ్చిపెట్టాయో! రోజూ రెండు జడలు వేసుకోరాదూ నువ్వు ?" పద్మ కళ్యాణి చుట్టూ తిరుగుతూ కామెంట్స్ పాస్ చేస్తోంది.

"ఛీ, కాస్త ఆడదానిలా ప్రవర్తించుదూ," విసుక్కుంది కళ్యాణి. "నాకీ బట్టలు క్రొత్తచేసి చస్తూంటే నీ వర్ణన లేమిటి మధ్యన ?"

"అదుగో, అదే వద్దనేది. మనం కాలేజీలో ఎన్ని రకాల ఫాన్సీడ్రెస్సులు వేశాం ? క్రొత్తా జంకూ లేకుండా స్వేచ్ఛగా నడవగలగాలి. మామూలుగా వుండు. దొంగ

చూపులు చూచావంటే అందరి దృష్టీ నీ మీదనే వుంటుంది. మరోసంగతి — మనం సాయంకాలం ఇంటికి తిరిగి వచ్చే వఱకూ ఒక్క తెలుగుమాట రాకూడదు. హిందీపరీక్షలు పాసైన తెలివంతా ఇప్పుడు చూపించాలి. లేదూ ఇంగ్లీషు లోనే కానిద్దాం."

గుంటూరు స్టేషన్‌లో దిగి పద్మా, కళ్యాణీ త్వర త్వరగా నడవసాగారు.

"నా మేకప్ చెరిగిపోలేదు కదా, చూడు." అంది కళ్యాణి.

"లేదు, ఫస్టుగా వుంది. కాని మన వూరు వదలగానే నీ జంకు పోయినట్టుందే? ఫ్రీగా నడుస్తున్నా విప్పుడు." అంది పద్మ నవ్వుతూ.

"నిజమేనే. ఏదైనా క్రొత్తపని పరిచితుల మధ్యకంటె అపరిచితుల దగ్గరే ధైర్యంగా చెయ్యగల్గుతాం."

ఇంట్లో పద్మనాభయ్యా, శ్రీహరీ చెప్పుకుంటూండగా, రఘురామయ్య ఇంటికి వెళ్ళేదారీ అవీ జాగ్రత్తగా విని వున్నది కళ్యాణి. పెద్దన్నయ్య భోజనానికి వెళ్ళగా చూచి అతడి టేబుల్ మీదినుంచి వాళ్ళ అడ్రస్ సంగ్రహించింది. ఈ అన్ని సేకరణల వలనా గమ్యస్థానం సులభంగానే జేరు కొన్నారు.

"కళ్యాణీ జాగ్రత్త. అంతర్నాటకంలో నీపేరుసురయా.

కథా నిలయం
931

నా పేరు రజియా. తెలుగుభాష నిషిద్ధం." ఆవరణలో అడుగు పెడ్తూ మరోసారి తగ్గుస్థాయిలో ఆజ్ఞాపూర్వకంగా హెచ్చరించింది పద్మ.

గేటుకు దగ్గరగా పెద్దవేపచెట్టు, కుడిప్రక్కన షెడ్డులో స్టుడీబేకరు కారు. ఆవరణనిండా వృత్తాకారాలలో అందమైన రకరకాల పూలమొక్కలూ, వాటి తీరుతెన్నులు. చిత్రవిచిత్ర రీతులలో కత్తిరింపబడిన లైన్ తోటకూర, మొక్కల మధ్యన ఫౌంటెన్ తమ పోషకులమొక్క కళా హృదయాన్ని చాటుతున్నాయి. ఎదురుగా పెద్దదీ, చిన్నదీ కాని రెండంతస్థుల భవనం. గోడలన్నీ లేత ఆకుపచ్చని రంగుపై లేతగులాబి వర్ణపు లతలు చిత్రింపబడి వున్నాయి. వెంటిలేటర్సుకు ఖరీదైన రంగుల అద్దాలు; గుమ్మాలకు, కిటికీలకు అందమైన సిల్కు కర్టెన్‌లు, గేటుదగ్గర కాపలా మనిషి! వారు చాలా ధనవంతులన్న విషయాన్ని చాటుతున్నాయి.

"క్యా, మాలిక్ ఘర్ మే హై?" అంది సురయా గేట్ కీపరు నుద్దేశించి.

వాడు కంగారుపడ్తూ చూచాడు.

"డాక్టర్ సాబ్ లోన వుండెనా?" తెలుగు తెలియనట్లు యాసగా అడిగింది రజియా.

"అమ్మగారూ, అబ్బాయిగారూ వున్నారు. అయ్యగారు వూళ్లో లేరు." అన్నా డతడు వాళ్ళను ఆశ్చర్యంగా చూస్తూ.

"అదృష్టవంతులమే" అన్నట్టు ఒకరి ముఖం ఒకరు సంతోషంగా చూచుకున్నారు సురయ్యా, రజియా. ఆవరణ దాటి, వరండా మెట్లెక్కి హాలులో ప్రవేశించా రిద్దరూ. నేలనిండా కాశ్మీర్ తివాచీ, ఖరీదైన సోఫాసెట్, ఒక గోడపై రవివర్మ చిత్రం, మరోగోడపైన అందమైన లాండ్ స్కేప్, హాల్లోనే మేడమె ట్లున్నాయి.

ఇద్దరూ హాల్లో నిల్చుని 'ఏం చేయడమా?' అని సందేహిస్తూండగా ప్రక్కగదిలోనుంచి ఒక నలభై యేళ్ళ పుణ్యస్త్రీ హాల్లోకి వచ్చింది. కట్టూ, బొట్టూ, అలంకరణా నడకా చాలా హుందాగా వున్నాయి. మరీ పాతకాలం కాదు; మరీ నాగరికం కాదు. అన్నిటినీ మించి చాలా అందంగా వుంది.

రజియా ఆమెకు అతివినయంగా నమస్కరించి; "నమస్తే మాతాజీ! హం ఏక్ ఛోటా కామ్ కే లియే ఆయా. కృపాకర్ కే థోడే సమయ్ ఆప్ హమ్‌సే బాత్ చీత్ కర్ సకియేగా? (మేము ఒక చిన్న పనిమీద వచ్చాం; దయ వుంచి కొద్దిసేపు మాట్లాడగలరా?)"

నమస్కారానికి ప్రతినమస్కారం చేసింది. కాని ఆమె కీ భాష బొత్తిగా అర్థం కాలేదు. సోఫాలో కూర్చోమని సౌంజ్ఞ చేసి, తా నొక కుర్చీలో కూర్చుంది. కొంత సేపు ఇద్దర్నీ పరీక్షగా చూచి "హిందూస్థానీయులా ?" అని ప్రశ్నించిం దావిడ.

"జీహాఁ," అంటూ మళ్ళీ ఏదో అనబోయిన రజియా ఆవిడముఖం విసుగ్గా పెట్టడం చూచి ఆగిపోయింది. పాపం, పూర్తిగా తెలియని భాషాయె మరి !

అంతలో మేడ మెట్లపై సవ్వడి విని ముగ్గురూ అటు తిరిగారు. మేడ దిగి వస్తూన్న యువకుడు హాలులో వారిని చూచి సందేహిస్తూ ఆగిపోయాడు. అత డెక్కడికో వెళ్ళ బోతున్నట్లుంది ! తీరు చూడగా.

"రా బాబూ, వీ ళ్ళెవరో భాష నాకు తెలియడం లేదు." అంది ఆ గృహిణి.

రజియా, సురయా అతడి మీదనుండి దృష్టి మరల్చు కోలేకపోయారు. గొప్ప ముఖవర్చస్సు, బంగారువర్ణపు శరీర చ్ఛాయ, నిండైన విగ్రహం, హుందాగా దర్పంగావున్న నడక, ఎదుటివారిని కట్టివెయ్యగల చూపులు, వెయ్యి. మందిలోనైనా ప్రత్యేకంగా కన్పింపజేసే ఏదో విశిష్టత వుం దతడిలో.

అటువచ్చి ఒకకుర్చీలో కూర్చుంటూ "గుడ్ మార్నింగ్ సిస్టర్స్. మే ఐ నో హు యు ఆర్.(సుప్రభాతం. మీరెవరో నేను తెలుసుకోవచ్చా సోదరీ?)". ఆ గంభీర కంఠస్వరం విని యింకా ముగ్ధులైపోయారు వారు. పద్మ కళ్యాణి చేతిని నొక్కింది రహస్యంగా 'జాగ్రత్త' అన్నట్టు.

రజియా కూడ యింగ్లీషులోనే అందుకుంది— "మేము యిక్కడే మెడిసిన్ చదువుతున్నాము. ఇటీవల ఈ ప్రక్కవూళ్ళో జరిగిన అగ్ని ప్రమాద బాధితుల సహాయార్థం ధనం వసూలు చేస్తున్నాము. మీబోటి ఉదారులందరూ......"

రజియావాక్యంపూర్తి కాకుండానే అతడు జేబులోంచి ఒక పదిరూపాయలనోటు తీసిచ్చి "ఇక నాకు పనుంది. సెలవివ్వండి." అని మృదువుగా అంటూ లేచాడు. రసీదు యివ్వబోతుంటే మందహాసం చేస్తూ వెళ్ళిపోయాడు, అందుకోకుండానే. అతడి తల్లికి నమస్కరించి రసీదు బల్లమీదుంచి వెళ్ళిపోయారు సురయా, రజియా.

"అతడు ఎంత సౌమ్యుడు కళ్యాణీ; ఎంత ఉదారత! ఎంత గంభీరత!" అంది పద్మ దారిలో.

కళ్యాణి తలవంచుకు నడుస్తూ ముసిముసి నవ్వులు నవ్వి వూరుకుంది.

"అబ్బో. అప్పుడే సిగ్గు వచ్చేసిందేమిటి?" హేళన చేసింది పద్మ.

"ఎక్కడా వెకిలిపోకడేలేదు. ఎంత పెద్దమనిషి తరహాగా ప్రవర్తించాడు!" అంది పద్మ తిరిగి.

ఆదివారం ఉదయం కళ్యాణి గదిలో కూర్చుని మాట్లాడుకుంటున్నారు కళ్యాణీ, పద్మా.

"నిన్ను చాలా అభినందిస్తున్నాను కళ్యాణీ. నీకు కాబోతున్న భర్త నిజంగా శ్రీకృష్ణభగవాను డంతటి. సౌందర్యవంతుడూ, గంభీరుడూను." అంది పద్మ.

"సంతోషించాం కాని చిన్న సవరణ. తెలివైన ఆడదెవ్వరైనాసరే శ్రీరామచంద్రునితో వనవాసమే కోరుకుంటుందికాని పదహారువేల ఎనమండ్రుగురు సవతులమధ్య శ్రీకృష్ణుడితో భోగాలు మాత్రం కోరుకోదోయ్." అని పకపకా నవ్వింది కళ్యాణి.

పద్మకు కూడా నవ్వువచ్చింది. "నిజంగా మనం గొప్ప సాహసమే చేశాం కళ్యాణీ; కాలేజీలో ఫాన్సీ డ్రెస్సుల అనుభవం ఇప్పుడు బాగా వుపయోగపడింది. ప్రతి విద్యా జీవితకాలంలో ఎప్పుడో ఒకప్పుడు వుపయోగపడి తీరుతుంది."

"చాలా కృతజ్ఞురాల్ని పద్మా; నీ సహాయమే

లేకుంటే అపోహలతో అనుమానాలతో అమృతాన్నే కాల దన్ని వుండేదాన్ని."

"సరేకాని మంచి ఇంగ్లీషు పిక్చర్ వుంది. వెళ్దా మేమిటి? శాంసన్ అండ్ డెలైలా."

"ఓ. తప్పకుండా."

ఇద్దరూ తయారై వెళ్ళబోతూంటే కమల చూచి "ఎక్కడికి?" అంది.

"సినీమా కమ్మా."

ఉగ్రురాలై పోయింది కమల. "చాల్లే, ఇంక నాల్గు రోజుల్లో పెళ్ళి. బంధువులంతా దిగుతున్నారు. నువ్వింకా సినిమాలూ, షికార్లూ అని యిలాగే విచ్చలవిడిగా తిరుగు. చూచినవాళ్ళు హర్షించాలా?"

"ఇందులోతప్పేముంది? అయినాబంధువులొస్తే నేనేం చెయ్యాలి? మర్యాదలు చెయ్యటానికి మీ రున్నారుగా?"

"వాదించావు కాని నడు లోపలికి. పద్మా, నువ్వు వెళ్ళమ్మా. కళ్యాణి ఇప్పుడు రాదు."

పద్మ మరి మాట్లాడకుండా వెళ్ళిపోయింది. కళ్యాణికి కన్నీళ్ళపర్యంతమైంది. 'ఛ! అడుగడుగునా ఆంక్షలే' అని తల్లిపై విసుక్కొంటూండగా పద్మనాభం ఎవరినో వెంట బెట్టుకు లోపలి కొచ్చాడు.

"చూడు కమలా. ఈయన గొప్ప జ్యోతిష్కులట. మహారాష్ట్ర బ్రాహ్మణులట." అని పద్మనాభం చెప్తూండగానే ఇంట్లో అందరూ అతడి చుట్టూ జేరిపోయారు. తివాచీ వేసి గౌరవంగా కూర్చోబెట్టింది కమల.

సినిమా ప్రోగ్రాం ఆగిపోయిందని కోపంగా వున్న కళ్యాణికి ఆ గడ్డం మనిషిని చూస్తే చికాకు పుట్టుకొచ్చింది. "ఎప్పుడో. ఏదో జరిగితే యివ్వాళ అది యితడు చెప్తాడట వెట్టి నమ్మకాలు." అని విసుక్కుంటూ తన గదిలోకి పోబోతూంటే తండ్రిమాటలు అడ్డుపడ్డాయి. "రామ్మా కళ్యాణీ. నీ చేయి వారికి చూపించు. ఈయన గొప్ప జ్యోతిష్కులట."

కళ్యాణికదలలేదు. "ఇంకా ఎందుకునాన్నా? ఇన్నాళ్లూ పెళ్ళెప్పు డెప్పుడని ఆత్రంగా కన్పించిన జ్యోతిష్కుడికల్లా చూపించేవాడవు. ఇప్పుడు నీ బెంగ తీరిందిగా?"

"అయితేనేమ్మా? ఒక్కసారి లారా. చూడనియ్యి, ఇంకా బెంగ పూర్తిగా తీరలేదుగా?"

అసలే కోపంగా వున్న కళ్యాణికి విసువుదల అధికమైంది. "నాకివేం నమ్మకంలేదు నాన్నా," అని పోబోయింది.

ఇక కమల కోపం అణచుకోలేక పోయింది. "అన్నిటికీ పెంకెతనమే, దానికలా చెల్లుతోంది." అంది కూతుర్ని కఠినంగా చూస్తూ.

"పోనీ కళ్యాణీ, నీకంత పట్టుదలేమిటి?" అన్నాడు శ్రీహరి అనునయంగా.

"పిల్లలెందరో అడుగవమ్మా కళ్యాణీ," అంది పెద్దవదిన లక్ష్మి.

"ఎగతాళి అక్కర్లేదు వదినా!" చురుగ్గా చూస్తూ వెళ్ళి ఆ జ్యోతిష్కుడి దగ్గర కూర్చుంది. "నాన్న దగ్గరి కొచ్చిన యే జ్యోతిష్కుడు వట్టి చేతులతో వెళ్ళాడు గనుక?" అంది నిరసనగా. జ్యోతిష్కులపై పద్మనాభానికి గల వెఱ్ఱి అభిమానం చూ స్తే ఆమెకు తలనొప్పి.

"తప్పు కళ్యాణీ;" మందలించాడు శ్రీహరి.

ఆ జ్యోతిష్కుడు కళ్యాణీ వామహ స్తం పట్టుకొంటూ ఆమె ముఖం పరిశీలనగా చూచాడు. ఎందుకో కనుబొమలు ముడిచాడు. అదే సమయంలో అతడి ముఖం చూచిన కళ్యాణికూడా కొంచెం కలవరపడింది.

"నా కే జ్యోతిష్కుడిపైనా యింతవఱకూ సదభిప్రాయం లేదు. మీరైనా ఆ అభిప్రాయం కల్గిస్తారని నా ఆశ," అంది.

చేతిలో రేఖలు పరీక్షిస్తున్న అతడు తలెత్తాడు. "నేటికి సరిగ్గా ఏడవరోజున మీ కళ్యాణం అవుతుంది. ఆ తర్వాత ఈ అందరి సమక్షంలోనే స్వయంగా మీచేతే నాపై గల అభిప్రాయం చెప్పిస్తాను"

సందేహంగా చూచింది కళ్యాణి. "ఈ మాత్రం

ఎవరినైనా అడిగి తెల్సుకొనికూడా చెప్పొచ్చు; జ్యోతిష్యపు ముసుగు అక్కర్లేదు."

అత డామె మాటలను లెక్కజెయ్యనట్టు చెప్పుకుపోతు న్నాడు. "మీపై లక్ష్మీ వాణీల కటాక్షం చాలా గొప్పది. మీ కాబోయే భర్త గుణవంతుడు, విద్యావంతుడు, రూపవం తుడు. త్వరలో మీరతనితో విదేశయానంకూడ చేసేట్లు రేఖలు చెప్తున్నాయి." చెప్పటం ముగించి 'ఏమంటావ్ ?' అన్నట్టు సగర్వంగా చూచా డతడు.

అతడి కొంటెచూపులకు కోపం వచ్చేసిన కళ్యాణి, "అరచేతిలో వైకుంఠం చూపడం జ్యోతిష్కులకు క్రొత్త కాదు." అంది చేతిని వెనక్కు తీసుకుంటూ.

అతడికీ కోపం వచ్చింది. "శాస్త్రాన్ని హేళన చెయ్యడం ఈ రోజులలో ఫాషనైంది." అంటూనే లేచి చకచకా వెళ్ళిపోయాడు. ఎందరు ఆపబోయినా ఆగలేదు. కళ్యాణిని అందరూ తలొక మాటా అన్నారు.

"భుక్తికోసమే బయల్దేరినవాడైతే అలా డబ్బు తీసు కోకుండా వెళ్ళిపోతాడా? తొందరపడ్డావమ్మా" అన్న తండ్రి మాటలు విని "నిజమేనేమో ?" అన్పించి క్షణం విచారిం చింది కళ్యాణి. అంతే, మరుక్షణమే మర్చిపోయి నవలా పఠనంలో మునిగిపోయింది.

కళ్యాణీశ్రీనివాసుల కళ్యాణం అతివైభవంగా జరిగింది. అందంలో, విద్యలో - అన్నిటా సరైన ఈ జంటకు సాటి ఉండదు, వుండబోదు అని అందరూ ప్రశంసించారు.

అన్ని వేడుకలూ ముగిశాయి. కళ్యాణిని భర్తతో సాగ నంపవలసిన రోజు సమీపిస్తోంది. ఒక ఆదివారం మధ్యాహ్నం అందరూ తీరికగా హాల్లో కూర్చుని యిష్టాగోష్టిలో పడ్డారు. కళ్యాణీ, శ్రీనివాస చక్రవర్తి, శ్రీహరీ, మురళీ తమ తమ విద్యార్థిదశలోని ముచ్చట్లు చెప్పుకుంటున్నారు. తల్లీ, తండ్రీ మౌనంగా ఆనందంగా తిలకిస్తున్నారు.

పెద్దకోడలు లక్ష్మి కలుగజేసుకొంది. "అయితే కళ్యాణీ, పెళ్ళికొడుకును చూడందే పెళ్ళిచేసుకో నన్నావు. ని న్నందరూ మోసం చేస్తున్నారని మండిపడ్డావు. నీ కోరిక నెరవేరక పోయినా చాలా సంతోషంగానే వున్నావే?" అహంభావి అయిన ఆడపడుచును ఏదో విధంగా వుడికించ టానికి చూస్తుంటుం దామె.

ఆమె మాట ఆసరాగా తీసుకుని ఇందిరబయల్దేరింది. "అవు నమ్మా, మా అన్నగార్నింత ప్రేమగా చూస్తా వనుకోలేదు."

కళ్యాణికి కోప మొచ్చేసింది. కాని మౌనంగా వూరు కుంది. ఎదురుగా భర్తవున్నాడు. అతడి సమక్షంలో తల్లిచేత చీవాట్లు తినడం యిష్టంలేదు.

"ఏం కళ్యాణీ,మీా వదినలేమిటో అడుగుతున్నారు ?" కొంటెగా నవ్వుతూ కవ్వించాడు శ్రీనివాస్. దానితో కళ్యాణి పూర్తిగా సహనం కోల్పోయింది. "పాపం, మీా పంతమే నెగ్గిందని సంతోషిస్తున్నారు కాబోలు పెద్దవాళ్ళందరూను. మిమ్మల్నందర్నీ 'ఫూల్స్'ని చేసి నేను స్వయంగా వెళ్ళి ఆయన్ని చూచుకొచ్చాను! తెలుసా?" సగర్వంగా ఒక్కసారి అందర్నీ చూచింది కళ్యాణి.

"ఆఁ!" అన్నలు, వదినలు, తల్లి, తండ్రి కడకు శ్రీనివాస్‌కూడా ఆశ్చర్యంగా నోరావలించారు.

కళ్యాణి చెప్పసాగింది. "నేనూ పద్మా అమరావతీ గుహలు చూడటానికి వెళ్తామని చెప్పలేదూ! ఆరోజునే గుంటూరు వెళ్ళి ఈ అమరేంద్రుణ్ణి చూచివచ్చాము. పంజాబీ డ్రెస్ వేసి ఎవ్వరూ గుర్తుపట్టలేనంతగా తయారయ్యాం. అగ్నిప్రమాదబాధితుల సహాయార్థం డబ్బు వసూలు చేస్తున్నామంటే దర్జాగా పదిరూపాయలిచ్చేశారు. రశీదైనా ఏమిచ్చామో చూచుకోకుండా. జ్ఞాపకముందా సార్ ?" అంది సగర్వంగా, భర్తవైపు తిరిగి, "పదిలంగా దాచాను మీాపది."

"ఓహో, అదా సంగతి. నిన్నెక్కడో చూచినట్టే అన్పిస్తోంది కాని, ఇన్నాళ్ళనుంచీ గుర్తే తెలియలేదు. పూర్తిగా

హిందీలో వుంది ఆవాళ నీ వ్యవహారం. మరి... ఆరోజు నీ చెంపమీద పెద్ద పుట్టుమచ్చ వుండాలి. కొట్టొచ్చినట్టు కన్పిస్తూ?" సరసంగానేవుంది శ్రీనివాస్ ధోరణి.

పకపకా నవ్వింది కళ్యాణి. "మేకప్ ట్రిక్స్‌లో నేను చాలా దిట్టనండోయ్," అంటూ.

"అమ్మయ్యో, ఇలాంటి భార్యతో అన్నగా రెలా వేగుతారో!" అంది కళ్ళు త్రిప్పుతూ ఇందిర.

"నిజంగా ఫస్టుక్లాస్ అడ్వెంచర్ చెల్లాయ్. మెచ్చుకు తీరాలి నిన్ను." అన్నాడు మురళి. చాల విషయాలలో ఆ అన్నా చెల్లెళ్ళిద్దరివీ ఒకటే అభిప్రాయాలు.

కమల మాత్రం బెదరిపోతోంది. అల్లుడికే మాగ్రహం కల్గుతుందోనని. ఆమెకు కూతుర్నిపై ఎప్పుడూ ఇవ్వాళ వచ్చినంత కోపంరాలేదు. అల్లు డెదురుగా వుండిపోయాడు కాని లేకపోతే కళ్యాణి నేంచేసి వుండేదో, ఆమెకే తెలియదు. కూతుర్ని అనవసర చదువులు చదివించి ఇలా తయారుచేసినందుకు ఇప్పుడైనా పద్మనాభం బుద్ధివచ్చి గట్టిగా లెంపలు వాయించుకుంటాడని నమ్మింది ఆమె. కాని భర్త ముఖం ఇదివరకటికంటె చిరునవ్వుతో ఆనందంగా వెలిగిపోవడం చూచి కమల కోపం అధికమైపోయి భర్తను మ్రింగేసేట్టు చూచింది.

ఆమె భావాలను గమనించనట్టే కూతురిపై దృష్టి త్రిప్పాడు పద్మనాభం. "ఎందుకంత శ్రమపడ్డావ్ కళ్యాణీ? నువ్వు మౌనంగా వూరుకున్నావు; పైపెచ్చు నేను చూచిన అబ్బాయేకదా అని అంగీకారమే అనుకున్నాను కాని మాట మాత్రం నాతో అంటే పెళ్ళిచూపు లేర్పాటు చెయ్యనూ? నేను నీ కోరిక ఏది తీర్చలేదు చెప్పు?"

"మీతో చెప్పలేకపోయాను నాన్నా. అమ్మతో చెప్తే కోపగించుకుంది. ఇంకేం చెయ్యను?" అంది జాలిగా కళ్యాణి,

"పోనీలే. చదువుకున్న పిల్ల నన్పించావ్; నాకదే సంతోషం," అన్నాడు గర్వంగా.

ఇహ ఆతండ్రి కూతుళ్ళ సంభాషణ వినలేక పోయింది కమల. అంత దారుణమైన పని చేసిన కూతుర్ని తండ్రి మందలించకపోగా సగర్వంగా లాలిస్తూంటే చూడలేక లేచి విసురుగా లోపలికి పోబోయింది. పద్మనాభం నవ్వుకున్నాడు.

"అత్తగారూ," శ్రీనివాస్ పిలుపు విని విస్తుపోయింది కమల. "వారంతా అమ్మాయి ఘనతను శ్లాఘిస్తూంటే మీ కోపం మొస్తోంది. పోనీ అల్లుడి ప్రతాపం వినైనా మెచ్చుకుందురుగాని, కూర్చోండి" అన్నాడు అదోరకంగా నవ్వుతూ.

అందరి కళ్లూ ప్రశ్నార్థకంగా అటు తిరిగాయి.

"కళ్యాణీ," కొంటెగా పిల్చాడు శ్రీనివాస్.

"ఏం మహాశయా ?" అంది కళ్యాణి చిలిపిగా.

"వివాహానికి ముందు ఒక జ్యోతిష్కుడు నీ హస్తం చూచాడు గుర్తుందా ?" అన్నాడు బలవంతంగా నవ్వాపుకుంటూ.

"ఊఁ. అయితే ?" అంది సందేహంగా కళ్యాణి.

"కొంపతీసి నువ్వే నేమిటోయ్ బావా ?" అన్నాడు మురళి శ్రీనివాస్ వీపు చరుస్తూ.

"సందేహమా ? నీ అభిప్రాయ మేమిటో చెప్పిస్తా నన్నానుగా. చెప్పు కళ్యాణీ.

"మీనాన్నగారిదగ్గఱ కొచ్చిన జ్యోతిష్కులందరికంటె పెద్ద బహుమానం కొట్టేసినవాడిని నేను," అన్నాడు చిలిపిగా కళ్ళు చిలికిస్తూ.

కళ్యాణి ముఖం కందగడ్డయిపోయింది. అందరూ ఆశ్చర్యపోయారు. అంతా ఏమిటో సినీమాలాగుంది వారికి.

మళ్ళీ శ్రీనివాస్ చెప్పాడు. "ఏ అమ్మాయిని చూచినా వంకపెడ్తున్నాననినేనుచూడటానికి వీల్లేదని శాసించారు నాన్న గారు. అందుకా అవతారం ఎత్తవలసివచ్చింది మరి! ఏం."

"మహా గొప్పపనేకాని నేనే ముందుచూచాను !" నెగ్గినట్టు. అంది కళ్యాణి వెక్కిరిస్తూ.

"ను వ్వారికే చూశావుకాని, నేను వివాహానికి ముందే పాణిగ్రహణం చేశాను. నేనే నెగ్గినట్టు." పెంకిగా అన్నాడు శ్రీనివాస్.

మురళి కల్పించుకున్నాడు. "ఆడపిల్ల ఆమాత్రం సాహసించడంలో అందముందికాని, మనం అంతమాత్రానికే ఘనకార్యమని మురిసిపోతే ఎల్లా బావగారూ? మా చెల్లెలే నెగ్గింది," అని చెల్లెల్ని సమర్థించాడు.

"బాగానేవుంది," అంది కమల ఏమిఅనటానికీ తోచక.

తృప్తిగా నిట్టూర్చాడు పద్మనాభం. "ఇందులో నెగ్గడం ఓడటం ఏమీలేదు. ఎవరి సాహసాలను తెలివితేటలను వారు ప్రదర్శించారు. శివధనస్సును అతితేలికగా విరిచిన శ్రీరామచంద్రునికే ఎక్కువ తక్కువలు నిర్ణయించడం కష్టం. వారిద్దరిదీ దీటైన జంట అనాలి. అంచేత చక్రవర్తిగారూ, నాకు అమ్మాయి వివాహంనాటికంటెకూడ ఈనాడెక్కువ సంతోషంగావుంది. అన్నివిధాల యింత అపురూపమైన పిల్లని ఎవరి చేతులలో పెట్టేస్తానో అని రాత్రింబవళ్ళు మథన పడేవాడిని. ఇకనాకు ఏచింతాలేదు." అన్నాడు ఆనందభాష్పాలతో.

"సాటిలేని దీ కళ్యాణం! కళ్యాణీ శ్రీనివాసులకళ్యాణం;" కొంటెగా పాడ్తూ గేలిచేశాడు కళ్యాణి చిట్టి మేనల్లుడు.